క్లుప్తంగా

వైద్య శిబిరం



ముఖ్య అతిథులతో అసోసియేషన్ సభ్యులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : సీఆర్ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రేణిగుంట తిరుపతి రహదారిలోని సీఆర్ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం డాక్టర్స్ అగర్వాల్ హాస్పిటల్, సీఆర్ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సీఆర్ఎస్ చీఫ్ వర్క్స్ మేనేజర్ దేవ సహాయం, ఏఐఎంఏ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ తేనేపల్లి జనార్దన్, డాక్టర్. బ్రహ్మానందం ముఖ్య అతిథులుగా పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ వర్క్స్ మేనేజర్ మాట్లాడుతూ.. గత సంవత్సరం అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, కార్యదర్శి విజయ్ కుమార్, గజపతి నాయుడు, కేకే రెడ్డి, వెంకట్ కృష్ణ దాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



వెంకటేష్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి అటవీక్షేత్ర పరిధిలో తొట్టంబేడు మండలం సింమగమాల ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ప్రొటెక్షన్ వాచర్ వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. వీరి కుటుంబానికి గురువారం ఫారెస్టు కన్జర్వేటర్ సెల్వం, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ రెండో విడత ప్రభుత్వ సాయం రూ.4 లక్షలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి అటవీశాఖ అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూలు



ఏర్పేడులో ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీవో

ఏర్పేడు (రేణిగుంట) : ఏర్పేడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు పల్లం, పాపానాయుడుపేట, ఏర్పేడు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పరిధిలో రుణాలకు 229 మంది దరఖాస్తు చేసుకోగా 182 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు. రుణాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

అర్హులకే భూపరిహారం అందించాలి

సత్యవేడు : కొందరి పేర్లు నోటిఫికేషన్‌లో చేర్చి అక్రమంగా ప్రభుత్వ భూములకు పరిహారం పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ ఆరోపించారు. గురువారం చిన్న ఈటిపాకంలో జరిగిన భూసేకరణ పట్టాల పరిశీలన సభలో సీపీఎం నాయకులు ఆర్డీఓ కిరణ్మయి దృష్టికి తెచ్చారు. ఇరుగుళం రెవెన్యూలో సర్వే నంబర్ 162–1లో 3 ఎకరాలా 82 సెంట్లు, చిన్న ఈటిపాకం రెవెన్యూ సర్వే నంబరు 3 బి1లో 3 ఎకరాలా 88 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమికి పరిహారం పొందేందుకు నోటిఫికేషన్‌లో పేర్లు చేర్చారని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి అర్హులకే పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న గోవు



రేణిగుంటలోని ప్రధాన వీధుల్లో సేదతీరుతున్న గోవుల సమూహం



24/7 రోడ్డుపైనే..

ప్రజలు నిత్యం వాడి పడేసే ప్లాస్టిక్ కవర్లే పశువులకు ఆహారంగా మారుతున్నాయి. రేణిగుంట పట్టణంలో సుమారు వందకుపైగా గోవులు రోడ్డుపైనే ఉంటున్నాయి. రాత్రి సమయంలో రోడ్డుపైనే నిద్రిస్తూ, పగలు అక్కడే ఉన్న వ్యర్థాలనే తింటూ జీవిస్తున్నాయి. గోవులకు అసలు యజమానులు ఉన్నారా? ఉంటే ఎందుకు ఇలా వదిలేస్తున్నారో అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ఆవులు ఎప్పుడూ రోడ్డుపైనే ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ప్రమాదాల బారిన జనం
- ప్లాస్టిక్ వ్యర్థాలే గోవులకు ఆహారం
- నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు
- గోశాల నిర్వాహకులు స్పందిస్తే ప్రయోజనం



రేణిగుంట ప్రధాన రహదారిపై వాహనాలకు అడ్డంగా ఉన్న గోవుల సమూహం



రోడ్డు వద్దనే సేద తీరుతున్న గోవులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : గోవులు రోడ్డుపైన ఉండటం వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు ఆసుపత్రి పాలు అవ్వటమే గాక, గోవులకు గాయాలైన సందర్భాలు ఉన్నాయి. యజమానులు సైతం గోవుల సంరక్షణ చూసుకోకుండా పాలు ఇచ్చే సమయంలో ఇంట్లో కట్టేసుకొని అనంతరం రోడ్లపైనే వదిలేస్తున్నారు. అధికారులు గోవుల యజమానులను గుర్తించి వారికి నోటీసులు అందజేసి గోవులను వదలకుండా చర్యలు చేపట్టాలి. యజమానులు లేకుండా తిరుగుతున్న గోవులను గోశాలకు తరలించి సంరక్షణ బాధ్యతను వారికి అప్పజెబితే పూర్తి స్థాయిలో గోవుల ఘోష ఉండదని స్థానికులు చెబుతున్నారు.

గోవుల సంరక్షణ ప్రభుత్వం చేపట్టాలి



రోడ్డుపైన ఉండే గోవుల బాధ్యతను ప్రభుత్వం చేపట్టి మండలానికి ఒక గోశాలను ఏర్పాటు చేయాలి. రోడ్ల పైన విచ్చలవిడిగా గోవులను వదిలేస్తున్న యజమానులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలి. మండలానికి ఒక గోశాల ఏర్పాటు వల్ల గోవులు రోడ్లపైన ఉండవు.

– వెంకటాద్రి యాదవ్, జాతీయ కార్యదర్శి, యాదవ హక్కుల పోరాట సమితి

గోవుల యజమానులకు నోటీసులు ఇస్తాం



రోడ్ల పైన విచ్చలవిడిగా వదిలేసిన గోవుల యజమానులను గుర్తించి వారికి నోటీసులు అందిస్తాం. నోటీసులకు స్పందించకపోతే తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతాం.

– మణి , ఈఓ, రేణిగుంట

నాటుసారాకు దూరంగా ఉండాలి

నారాయణవనం : నాటు సారాతో సంభవించే దుష్ప్రభావాలను వివరిస్తూ ఎక్సైజ్ , ప్రొహిబిషన్ అధికారులు అవగాహన కల్పించారు. గురువారం రాత్రి మండలంలోని తిరువట్యం దళితవాడలో ఎక్సైజ్ సీఐ శివప్రసాద్, ఎస్ఐ అంజాద్ బాషా మాట్లాడుతూ.. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గతంలో నాటు సారాను తయారు చేసి విక్రయించే గ్రామాలను గుర్తించి, భవిష్యత్తులో నాటుసారా జోలికి పోకుండా చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. మండలంలో తిరువట్యం దళితవాడలో గురువారం రాత్రి ఇంటింటా సిబ్బంది వెళ్లి నాటు సారా దుష్ప్రభావాలను వివరించామన్నారు. నాటు సారాకు దూరంగా ఉంటే దశలవారీగా పాత కేసులను మాఫీ చేస్తామని, చదువుకున్న యువతకు శ్రీసిటీలో కొలువులు ఇప్పిస్తామని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసేకరణలో రికార్డుల పరిశీలన

సత్యవేడు : మండలంలోని ఇరుగుళం, చిన్నఈటిపాకం గ్రామాల్లో ఏపీఐఐసీ చేపడుతున్న భూసేకరణలో భాగంగా రికార్డుల పరిశీలన చేపట్టారు . గురువారం సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది రికార్డులు పరిశీలించారు. ఇరుగుళం పరిధిలో 5 మంది, చిన్న ఈటిపాకంలో 25 మంది రైతుల భూ రికార్డులు తనిఖీ చేశారు. రైతు అనుభవంలో ఉన్న భూ విస్తీర్ణ, అనువంశికం, ఎస్‌బీ, అడగల్ రికార్డులను పరిశీలించారు. పలువురు రైతులు భూముల ధర ప్రకటించాలని రెవెన్యూ అధికారులను కోరారు. తహసీల్దారు రాజశేఖర్, శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు, మండల సర్వేయర్ చంద్ర శేఖర్ కుమార్, వీఆర్‌ఓలు, సర్పంచులు శేఖర్, గోవిందస్వామి పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రభుత్వ పాఠశాలలో అమలు అవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారి–2 మునిసుబ్రమణ్యం హెచ్చరించారు. గురువారం మండలంలోని నెరిణికండిగ్ర గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఉత్సవాలు విజయవంతం



మాట్లాడుతున్న ఈవో బాపిరెడ్డి..చిత్రంలో ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి : అన్ని శాఖల సమన్వయంతో శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం అయినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. గురువారం ధూర్జటి కళా ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈవో బాపిరెడ్డి మాట్లాడుతూ.. ఫిబ్రవరి 21 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అందుకు అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉత్సవాల విజయవంతానికి పలు సూచనలు, సలహాలు అందించారన్నారు. దీంతో ఉత్సవాలను విజయవంతం చేసినట్లు తెలిపారు. అనంతరం నంద్యాలకు చెందిన కూరగాయల దాత ప్రసాద్‌ను అలయ అధికారులు, పలు శాఖల అధికారులను సన్మానించి జ్ఞాపిక, ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింహమూర్తి, పలుశాఖల అధికారులు, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



కూరగాయల దాతను సన్మానిస్తున్న ఈవో , తదితరులు

రోడ్డు పనుల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పల్లమాలలో పల్లెపండుగ కార్యక్రమంలో వేస్తున్న సిమెంట్ రోడ్డు పనులను గురువారం ఎంపీడీఓ త్రివిక్రమ్ రావు , ఏఈ నాగరాజుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 30వ తేదీ లోపు పల్లెపండుగ సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. పల్లమాలలో రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. పనులు నాణ్యతగా చేయాలని కోరారు. అదే విధంగా గోకులం షెడ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



సీసీ రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజలో పదో తరగతి విద్యార్థులు

వరదయ్యపాళెం : కేవీబీపురం మండలంలోని కాళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. పదిలో ఉత్తమ ఫలితాలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎంఏ తిరువెంగలాచార్యులు, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ వాసుదేవ రావు, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, భుజంగరావు, విజయ్‌కుమార్, అశోక్ ఉన్నారు.

బాలుడి అప్పగింత



బాలుడి బంధువుతో మాట్లాడుతున్న ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ : బుచ్చినాయుడుకండ్రిగలో సంచరిస్తున్న తెలంగాణ రాష్ట్రం కామారెడ్డికి చెందిన బాలుడు రవీందర్ (12)ను ఎస్ఐ విశ్వనాథనాయుడు గుర్తించి గురువారం బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డికి చెందిన 7వ తరగతి చదువుతున్న విద్యార్థి రవీందర్ బుచ్చినాయుడుకండ్రిగలోని పుర వీధుల్లో తిరుగుతూ కనబడడంతో అనుమానం వచ్చి విచారించామన్నారు. తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి సొంత ఊరని తెలపడంతో బంధువులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. బంధువులు రావడంతో వారికి బాలుడు రవీందర్‌ను అప్పగించామన్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని బంధువులకు సూచించారు.

అతివలకు ఆర్థిక స్వేచ్ఛ రావాలి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఐసీడీఎస్ పరిధిలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం –2025 కార్యక్రమాన్ని స్థానిక పురపాలక సంఘం సమావేశ మందిరంలో గురువారం సీడీపీవో శాంతి దుర్గ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. స్త్రీ జీవితంలో పుట్టుక, విద్య, వివాహం, ఆర్థిక స్వావలంబన, ఈ నాలుగు అంశాలు పరిపూర్ణత కలిగి ఉండాలని అప్పుడే స్త్రీకి నిజమైన స్వేచ్ఛ ,సమానత్వం కలిగినట్లని తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ, సమానత్వం ఇంకా రావాల్సి ఉందని తెలియజేశారు. మహిళలకు పలుపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సుస్మిత తొట్టంబేడు తహసీల్దారు మధుసూదన్, పురపాలకసంఘం కమిషనర్ గిరి కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు



మహిళలకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీవో

స్టేషన్ సందర్శన

ఏర్పేడు(రేణిగుంట) :ఏర్పేడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల పనితీరును పరిశీలించి ప్రత్యక్ష అనుభూతిని పొందారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు స్టేషన్‌ను సందర్శించి సీఐ జయచంద్రను కలిశారు. తొలుత రిసెప్షన్‌లో ఏదైనా కేసుకు సంబంధించి ఎలా ఫిర్యాదు చేయాలి? అనే విషయాలు తెలుసుకున్నారు. కంప్యూటర్ విభాగం వద్దనున్న వాకీటాకీ మాట్లాడే విధానం, కంప్యూటర్‌లో కేసుల వివరాల నమోదు చేసే విధానాన్ని సీఐ వివరించారు. విద్యార్థులు పోలీస్ స్టేషన్ వ్యవస్థపై అవగాహన కోసం స్టేషన్‌ను సందర్శించటం సంతోషకరమన్నారు. చట్టాలపై చిన్నప్పటి నుంచే అవగాహన ఉండాలని సూచించారు. ఈ సందర్శనలో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, హైస్కూల్ పీడీ శివకుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులకు వివరిస్తున్న సీఐ జయచంద్ర

సేవలకు సత్కారం

సత్యవేడు : దేవాంగ సామాజిక వర్గంలో సమాజ సేవ చేస్తున్న మహిళలను సన్మానించి గౌరవిస్తున్నట్లు దేవాంగాభ్యుదయ సంఘం నాయకులు త్యాగరాజు తెలిపారు. గురువారం సత్యవేడులోని మాజీ ఎంపీటీసీ బొప్పన వికితను దేవాంగ సంఘం నాయకులు మహిళా దినోత్సవం సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవాంగ సంఘం ప్రతినిధులు మన్నె హేమావతి, విజయ, కాంచన, జక్కుల ప్రభావతి, హేమలత (చిత్తూరు) లను సన్మానించారు. కార్యక్రమంలో బండ్ల సుబ్రమణ్యం , జక్కుల కరుణాకర్, రామచంద్రయ్య, మునస్వామి, బండారు మోహన్ బాబు, బొప్పన సోమశేఖర్, జక్కుల శివానందం పాల్గొన్నారు.



ఎంపీటీసీ వికితను సన్మానిస్తున్న సంఘం నేతలు

కళ తప్పిన ఉత్సవాలు

- అవగాహన లోపం.. గందరగోళం
- ఉత్సవాల్లో కొరవడిన సమన్వయం



వెలవెలబోయిన సాంస్కృతిక కార్యక్రమాలు (ఫైల్)



వాయినం అందిస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్)

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు 14 రోజులుగా కన్నప్ప ధ్వజారోహణంతో మొదలై వేద పారాయణంతో ముగిశాయి. కూటమి ప్రభుత్వం ఎంతో వైభవంగా నిర్వహిస్తారని ఆశించిన వారికి భంగపాటు ఎదురైంది. సమన్వయలోపం, అవగాహన రాహిత్యంతో గందరగోళంగా మహాశివరాత్రి ఉత్సవాలు జరిగాయి. రాష్ట్ర మంత్రులు తరలి వచ్చి దిశా నిర్దేశం చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయారు.

గోడపత్రికల నుంచి ఆహ్వాన పత్రికల వరకు ఏదీ సక్రమంగా నిర్వహించకపోవడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. స్థానికులతో సమావేశాలు వంటి కార్యక్రమాలపై మొగ్గు చూపలేదు. వీఐపీల ఆహ్వానంలోనే 20 రోజులు తరించారు. ఎమ్మెల్యే , కలెక్టర్ , ఈవో , ఎస్పీ రెండుసార్లు సమావేశాలు నిర్వహించినప్పటికీ సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందులు పడ్డారనే చెప్పాలి.

ఆశించిన జనం రాక

బ్రహ్మోత్సవాలకు1.50 లక్షల మంది భక్తులు వస్తారని ఆశించినా సగం మంది కూడా రాలేదు. కూటమి ప్రభుత్వానికి తొలి ఉత్సవం కావడంతో ఆలయం తరఫున వాయనంగా రవిక, పసుపు, కుంకుమ, గాజులు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే భక్తులకు ఇచ్చే బాధ్యత టీడీపీ కార్యకర్తలకు అప్పగించడం విమర్శలకు దారితీసింది. ఫ్లెక్సీల్లో ఎంపీ, ఎమ్మెల్సీల ఫొటోలు లేకుండా ఏర్పాటు చేయడం , ఆహ్వాన పత్రికల్లో ఉభయదారులను సరిగ్గా గౌరవించకపోవడం వంటి అంశాలు ప్రొటోకాల్‌కు విఘాతం కలిగించాయి.

లింగోద్భవం సమయంలో..

బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన లింగోద్భవ దర్శనానికి వేల మంది భక్తులు ఒక్కసారిగా ఆలయంలోకి ప్రవేశించడంతో లింగోద్భవ దర్శనం గందరగోళంగా మారింది. ప్రతి ఉత్సవం అనుకున్న సమయానికి కంటే ఆలస్యంగానే జరగడంతో భక్తులు నిరుత్సాహపడ్డారు. అలాగే కళారూపాలపై ఈ ఏడాది ప్రత్యేక శ్రద్ధ కనిపించలేదు.

జాడ లేని ప్రముఖులు

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి నాలుగు రాష్ట్రాలు తిరిగి ముఖ్యమైన నాయకులకు, హీరోలు, సినీ ప్రముఖులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. అయినా ముఖ్యమైన ప్రముఖులు, ప్రవచనకర్తలు, ఆధ్యాత్మికవేత్తలు, పీఠాధిపతులు, సినీ ప్రముఖులు కనిపించకపోవడంతో కార్యక్రమాలు వెలవెలబోయాయి. టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ప్రొటోకాల్ పేరుతో ఆలయంలో హల్‌చల్ చేయడంపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అయింది.

స్ఫూర్తి



అథ్లెట్ దీప్తి జీవన్‌జీని సత్కరిస్తున్న నిర్వాహకులు

రేణిగుంట : భారతీయ పారాలింపిక్ అథ్లెట్ దీప్తి జీవన్‌జీ గురువారం రేణిగుంటలోని డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్‌ను సందర్శించారు. జపాన్‌లోని కోబ్‌లో జరిగిన 2024 పారాలింపిక్స్ (400 మీటర్ల టీ20 పరుగు)లో కాంస్య పతకం గెలుచుకుని, 2024 ప్రపంచ చాంపియన్ షిప్‌లో 55.06 సెకన్లతో ప్రపంచ రికార్డు సృష్టించిన ఘనత దీప్తి జీవన్‌జీ అని ఆమె తమ విద్యాసంస్థకు రావటం అదృష్టమని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రీడల్లో రాణించాలని స్కూల్ అధినేత విక్రమ్‌శాలీ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కె.అనూష, ఏవో మాధవి, వ్యాయామ ఉపాధ్యాయులు వంశీ పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

నాగలాపురం : పిచ్చాటూరు మండల తహసీల్దారుగా టి.వి.సుబ్రమణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలలుగా నారాయణవనం తహసీల్దార్ జయరాం ఇంచార్జ్‌గా ఉన్నారు. రెగ్యులర్ తహసీల్దార్ లేనందున ప్రభుత్వం తిరుపతి కలెక్టరు కార్యాలయం నుంచి సుబ్రమణ్యంను పిచ్చాటూరుకు బదిలీ చేశారు. అందరి సహకారంతో సమస్యల పరిష్కారం తెలిపారు.